సాక్షి
చిత్తూరు

మంగళవారం ౹ 11 ౹ ఫిబ్రవరి ౹ 2025



మా సమస్యలు పరిష్కరించండి

తమ వినతులు విని.. సమస్యలు పరిష్కరించండి సారూ..! అని ప్రజలు అధికారులను వేడుకున్నారు. - 8లో



మా ఇళ్లను కూల్చనీయం

జాతీయ రహదారి విస్తరణకు తమ ఇళ్లను కూల్చనీయం అని రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెవాసులు తీర్మానించారు. - 8లో



తొండ తెచ్చిన తంటా

ఐరాలలో తొండ ట్రాన్స్‌ఫార్మర్ పైకి వెళ్లడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. - 8లో

న్యూస్‌రీల్

3.53 లక్షల మందికి ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నులి పురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను 97 శాతం మంది పిల్లలకు పంపిణీ చేశారు. జిల్లాలో 3,63,888 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వాల్సి ఉండగా 3,53,699 మందికి మాత్రలను పంపిణీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రయోగ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపు విద్యార్థుల ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సంబంధిత పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం నిర్వహించిన ప్రయోగ పరీక్షకు 1,352 మంది విద్యార్థులకు గాను 1,321 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,075 మందికి గాను 1,049 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ వెల్లడించారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న మేదర, కుమ్మర శాలివాహన కులస్తులు బీసీ కార్పొరేషన్ అందించనున్న స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మేదర, కుమ్మర, శాలివాహన సామాజిక వర్గాలకు 139 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ స్వయం ఉపాధి రుణాలకు ఒక్కో యూనిట్‌కు గ్రూపు (కనీసం 3 నుంచి ఐదుగురు) సభ్యులుండాలన్నారు. వయస్సు 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. ఒక్కొక్క యూనిట్‌కు ప్రభుత్వ సబ్సిడీ రూ.1.50 లక్షల బ్యాంకు రుణం రూ.1.50 లక్షలు మొత్తం రూ.3 లక్షలు అందజేస్తారన్నారు. జిల్లాలోని అర్హులు వారు కులం, రేషన్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. www.apobmms.dev.nidhi.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఏఈఓ బాబురెడ్డి 9908132043, అయ్యప్ప జూనియర్ అసిస్టెంట్ 8500049185 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యుత్ నిత్యావసర వస్తువుగా మారింది. అది లేనిదే ఏపనీ సాగని పరిస్థితి నెలకొంది. జలవిద్యుత్ ఉత్పత్తికి నేడు ప్రాజెక్టుల్లో నీరు నిల్వ లేని దుస్థితి ఉంది . దీంతో థర్మల్, అణు విద్యుత్‌పై ఆధారపడాల్సి వస్తోంది. బొగ్గు దిగుమతి విదేశీ మారక ద్రవ్య నిల్వలపై ప్రభావం పడుతోంది. అణు విద్యుత్‌తో వాతావరణం కలుషితమవుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి పర్యావరణ హిత విద్యుత్ ఉత్పత్తే ఏకైక మార్గం. ఈ నేపథ్యంలో జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పీఎం కుసుం పథకం కింద 200 మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి రంగం సిద్ధమైంది.



కొత్తపల్లెలో గుర్తించిన ప్రభుత్వ స్థలం

సౌర కిరణం.. కీర్తి మకుటం

- జీడు భూముల్లో సోలార్ ప్లాంట్లు
- పీఎం కుసుం పథకానికి వెయ్యి ఎకరాల గుర్తింపు
- ఉత్పత్తి చేసిన విద్యుత్ సేద్యానికి వినియోగం

చిత్తూరు కార్పొరేషన్: నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పీఎం కుసుం పథకం కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. అక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వ్యవసాయ సర్వీసులకు వినియోగించనున్నారు. తొలిదశలో జిల్లాలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములు గుర్తించి, అనుమతుల కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ప్రధానమంత్రి కిసాన్ ఊత్థాన్ మహాభియాన్(పీఎం కుసుం) పేరుతో కేంద్రం కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా పది వేల మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్టును చేపట్టింది. గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే దీన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు.

వ్యవసాయానికి వినియోగం

జిల్లాలోని కుప్పం, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలు, వెదురుకుప్పం, వి.కోట, నగరి, జీడీనెల్లూరు మండలాల్లో 200 ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను ట్రాన్స్‌కో అధికారులు సర్వే చేసి, గుర్తించారు. ఇందులో గుడిపాల, బంగారుపాళెం, యాదమరి ప్రాంతాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఉపయోగంగా ఉన్న భూమి ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. తదుపరి నెడ్‌క్యాప్ అధికారులు వాటిని పరిశీలించి ఫైనల్ చేయనున్నారు. చివరిగా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాక ప్రతి 5 ఎకరాల్లో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నారు. పనుల పూర్తయ్యాక అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను వ్యవసాయానికి అందించనున్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ క్రమంలో వేసవి సమయంలో లోడ్ పెరిగినప్పుడు విద్యుత్ సరఫరా కష్టంగా మారుతోంది. అప్పుడు అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచన తీసుకొచ్చింది. ఇందుకోసం అధికారులు కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. అక్కడ 650 ఎకరాలు భూమిని గుర్తించి 196 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలల్లో 350 ఎకరాలు గుర్తించి 60 మెగావాట్లను ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. కుప్పంలో వ్యవసాయ సర్వీసులకు మొత్తం సోలార్ ప్లాంట్ల ద్వారా వచ్చే విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ప్లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ను వాడుకుని మిగిలిన వాటికి శాఖాపరంగా ఇవ్వనున్నారు. ఒక మెగావాట్ ప్లాంట్‌లో నెలకు 1.20 లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ లెక్కన మొత్తం 256 మెగావాట్ల పరంగా నెలకు 30.72 కోట్ల యూనిట్ల కరెంటును జిల్లాలోని 1.59 లక్షల వ్యవసాయ సర్వీసులకు వినియోగించనున్నారు.

ప్రతిపాదనలు పంపాం



జిల్లాలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి, కలెక్టర్‌కు నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నాం. పీఎం కుసుం పథకం ద్వారా వ్యవసాయ సర్వీసులకు సోలార్ విద్యుత్‌ను ఇవ్వాలన్నదే ముఖ్య ఉద్దేశం. దీంతో వ్యవసాయ సర్వీసులకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుంది. వాడకం పెరిగిప్పుడు అంతరాయం కలిగే సమస్యలు ఉండవు. – ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

జిల్లాలో వెయ్యి ఎకరాల గుర్తింపు

జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నారు. వీటి ఏర్పాటు ద్వారా జిల్లాలో సుమారు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. మొత్తం వెయ్యి ఎకరాల్లో కుప్పం నియోజకవర్గంలోనే 650 ఎకరాలు గుర్తించారు. అక్కడ వందశాతం వ్యవసాయ సర్వీసులకు సోలార్ విద్యుత్ ఇవ్వాలన్నదే ఉద్దేశం. మిగిలిన ప్రాంతాల్లో సోలార్, శాఖపరంగా విద్యుత్‌ను రైతులకు అందించనున్నారు. మొదటి దశలో ప్లాంట్లను ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయనున్నారు. తదుపరి అవసరమైన ప్రాంతాల్లో రైతుల నుంచి పొలం లీజుకు తీసుకుని ఏర్పాటు చేయనున్నారు. కుసుమ్ ప్రాజెక్టుకు రైతులైతే కనీసం ఐదెకరాలు పొలం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఎకరాకు ఏడాదికి రూ.30 వేల వరకు లీజు పొందొచ్చు.



గుడిపాలలో భూమిని పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్, ఈఈ మునిచంద్ర

'పరీక్ష పే చర్చ' వీక్షణ



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సోమవారం నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమం వీక్షించారని సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ విద్యార్థులతో పరీక్షల సన్నద్ధంపై సంభాషించినట్లు చెప్పారు. పరీక్షలకు సన్నద్ధం, సలహాలు, సూచనలు పరీక్ష పే చర్చాలో చర్చించారన్నారు. జిల్లాలోని 380 ప్రభుత్వ పాఠశాలలు, 142 ప్రైవేట్ మొత్తం 522 పాఠశాలల్లో 59,601 మంది విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు కార్యక్రమం వీక్షించారన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణను ఎంఈఓలు పర్యవేక్షించినట్లు తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 25 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 25 వినతులు అందాయి. చిత్తూరు ఎస్పీ మణికంఠ ఏఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇళ్లు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యపై విచారణ జరిపి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన పెద్దిరెడ్డి

సదుం: మండల కేంద్రంలోని సంతలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. సంతలో సరైన సౌకర్యాలు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతుండడంపై స్పందించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయించారు. ఎన్నికల ముందు షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల వివరాలను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి ఆయనకు వివరించారు. అంతకు ముందు చింతపర్తివారిపల్లెలో బాలాజీరెడ్డి గృహంలో జరుగుతున్న శుభకార్యానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుంజయ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, వార్డు సభ్యులు భాస్కర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జెల్లి ఫ్యాక్టరీ మాకొద్దు ప్రభో!

కుప్పంరూరల్: కుప్పం మండలం, వరమనూరు వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న జెల్లి ఫ్యాక్టరీ తమకొద్దని గ్రామస్తులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల దృష్టికి తెచ్చారు. నూతనంగా కృష్ణదాసనపల్లి పంచాయతీ వరమనూరు వద్ద కొంత మంది వ్యక్తులు జెల్లి ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని అనుమతులు పొంది ప్రస్తుతం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారని, జెల్లి ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే తమ పొలాలు దెబ్బతింటాయని, తాము ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని జనం అధికారుల దృష్టికి తెచ్చారు. వరమనూరు గ్రామంలో అంతా సన్న చిన్నకారు రైతులే ఉన్నారని, అలాంటి భూముల సమీపంలో జెల్లి ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సర్వం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన చెందారు. అధికారులు పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జెల్లి ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకోవాలని వినతిలో పేర్కొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న కేడీ పల్లి పంచాయతీ వాసులు

మిత్రధర్మం..పారదర్శకతకు పాతర.. ఖరారైన రిజర్వేషన్ల మార్పు.. బీజేపీ, జనసేనలకు రిక్తహస్తం.. తమ్ముళ్లకే అధిక ప్రాధాన్యత..అధిక ఆదాయం ఉన్న కమిటీల్లో పాగాకు తమ్ముళ్లు నువ్వా..నేనా? అన్న రీతిలో పోటీ.. చైర్మన్ గిరిల కోసం అధినేతల వద్ద ముమ్మర ప్రయత్నాలు.. ఎమ్మెల్యే.. ఎంపీల మధ్య విబేధాలు.. ఇదీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుల కేటాయింపు తీరు. ఈ స్థితిలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందోలేదోన్న అనుమానం.. తమ్ముళ్లకే అగ్రతాంబూలం ఇస్తారన్న అభిప్రాయం వెలువుడుతుంది. ఏమీ జరుగుతుందన్న విషయం వేచి చూడాల్సిందే



తమ్ముళ్లకే అగ్రతాంబూలం



చిత్తూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

- జిల్లాలో పూర్తయిన మార్కెట్ చైర్మన్ రిజర్వేషన్లు
- పట్టుపట్టి కుప్పం, చిత్తూరు చైర్మన్ స్థానాల మార్పు?
- బీజేపీ, జనసేనకు రిక్తహస్తం? తమ్ముళ్ల మధ్యే పోటీ
- ఎంపీ, ఎమ్మెల్యేల అనుచరుల మధ్య పోటీ తీవ్రతరం
- నెలాఖరులోపు పేర్లు వెల్లడించనున్న కూటమి ప్రభుత్వం

చిత్తూరు అర్బన్: జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఏడు నియోజకవర్గాల్లోని పది మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానాల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక సైతం అందజేసినట్లు తెలుస్తోంది. ఆదాయం ఉన్న పెనుమూరు, బంగారుపాళెం, చిత్తూరు, కుప్పం లాంటి ఆర్థికంగా బలమైన స్థానాలకు నువ్వా–నేనా అన్నట్లు పోటీ నెలకొంది. ఈ పోటీ ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు సృష్టిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీలో ఈసారి కూడా జనసే, బీజేపీ నేతలను దూరం పెట్టి.. తమ్ముళ్లకే అగ్ర తాంబూలం ఇవ్వడానికి సర్వం సిద్ధం చేశారు.

రిజర్వేషన్లు ఇలా..

మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుల్లో గతేడాది డిసెంబర్‌లో తొలుత కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇందులో చిత్తూరు, పుంగనూరు బీసీ–జనరల్, కుప్పం, పలమనేరు బీసీ–మహిళ, సోమల ఎస్సీ మహిళ, ఎస్ఆర్ పురం ఎస్సీ జనరల్, రొంపిచెర్ల, నగరి ఓసీ మహిళ, పెనుమూరు, బంగారుపాళెం ఓసీ జనరల్‌కు రిజర్వు చేసినట్లు సమాచారం. అయితే రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాత, కూటమి నేతలు జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గతనెల మళ్లీ మరోసారి రిజర్వేషన్లు మారినట్లు సమాచారం. ఇందులో చిత్తూరును బీసీ మహిళ, కుప్పం బీసీ జనరల్‌కు మార్పు చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లినట్లు తెలుస్తోంది.

పచ్చనేతల మధ్యనే పోటీ..

ఇక చైర్మన్ పోస్టుల్లో ఈసారి కూడా జనసేన, బీజేపీ నేతలకు రిక్తహస్తం తప్పేలాలేదు. ఇప్పటికే భర్తీ చేసిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీ మిత్రధర్మాన్ని పాటించకుండా ఏకపక్షంగా తమ పార్టీ నేతలకే పదవులు కట్టబెట్టినట్లు కూటమిలోని ఇతర పార్టీలు అరిచి గగ్గోలు పెడుతున్నాయి. అయినా సరే మా దారి మాదే అన్నట్లు మార్కెట్ కమిటీల్లోనూ తమ్ముళ్లకే అగ్రపీఠం వేయనున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు చిత్తూరు కమిటీ చైర్మన్ పదవిని ఎమ్మెల్యే వర్గం వెంకటేష్ యాదవ్‌కు ఇవ్వాలని నిర్ణయించగా, దీన్ని వ్యతిరేకించిన మరోవర్గం బీసీ మహిళకు రిజర్వు చేయించినట్లు చెబుతున్నారు. బంగారుపాళెం చైర్మన్ కుర్చీపై ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య పోటీ నడుస్తున్నట్లు సమాచారం. పెనుమూరు చైర్మన్ పోస్టుకు ఎమ్మెల్యే ఓ వ్యక్తి పేరు ఖరారు చేయగా, ఎస్ఆర్ పురం మార్కెట్ చైర్మన్ మాత్రం పాలసముద్రానికి చెందిన మరో టీడీపీ నేత తన అనుచరుడికి పోస్టు ఇప్పించడానికి చినబాబు వద్ద నేరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కుప్పం స్థానానికి గుడుపల్లె, శాంతిపురానికి మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్లతో సహా ఆరుగురు పోటీపడుతున్నారు.

'గీత' కులాలనూ వదల్లేదు!

- బినామీలతో దుకాణాలు దక్కించుకున్న నేతలు
- పెద్ద పంజాణిలో గౌండ్ల లేకపోవడంతో రద్దు
- ముగిసిన మద్యం దుకాణాల కేటాయింపు

చిత్తూరు అర్బన్: గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం దుకాణాలనూ టీడీపీ నేతలు వదల్లేదు. పలుచోట్ల బినామీల ద్వారా దుకాణాలు దక్కించుకుని.. ఆ సామాజికవర్గాల్లోని నిజమైన వర్గాల కడుపు కొట్టారు. జిల్లాలో గీత కులాలకు 50 శాతం రాయితీతో మద్యం దుకాణాలను కేటాయించడానికి గతనెల అధికారులు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మొత్తం పది మద్యం దుకాణాలకు 79 దరఖాస్తులు రాగా, సోమవారం చిత్తూరులోని కలెక్టరేట్‌లో వీటిని లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరిగింది. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ డిప్ ద్వారా దుకాణాల లైసెన్సులు వచ్చిన వాళ్లను నిర్ణయించారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాస్, సీఐలు శ్రీహరిరెడ్డి, పురుషోత్తం తదితరుల సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపునకు గౌడ, గౌండ్ల, గౌడ్, ఈడిగ ఉప కులాల నుంచి మొత్తం 79 దరఖాస్తులు రాగా, పెద్దపంజాణి దుకాణాన్ని గౌండ్లకు కేటాయించడంతో అక్కడ ఒకే ఒక్క దరఖాస్తు వచ్చింది. పోటీ లేకపోవడంతో అతనికే దుకాణం అనుకున్న తరుణంలో.. లాటరీ ప్రక్రియ జరిగిన సమయంలో సంబంధిత వ్యక్తి గౌండ్ల కాదని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. దీంతో ఆ దుకాణానికి వచ్చిన టెండరును రద్దు చేసి, తదుపరి నిర్ణయం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇక దుకాణాలు దక్కించుకున్న తొమ్మిది మంది లైసెన్సుదారులు మంగళవారం నుంచే వ్యాపారాలు ప్రారంభించుకోవచ్చని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గీత సంఘాలకు లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ ఉండడం, నిర్ణీత ప్రదేశంలో ఎక్కడైనా దుకాణం పెట్టుకోవచ్చనే వెసులుబాటు ఉండడంతో అన్–రిజర్వు కింద దుకాణాలు దక్కించుకున్న కూటమి నేతల్లో ఆందోళన నెలకొంది.



లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్

మొదలైన బెదిరింపులు

లక్కీ డిప్‌లో ఎస్ఆర్.పురం మండలం పాతపాళేనికి చెందిన అలేఖ్య అనే మహిళకు పాలసముద్రం మద్యం షాపు దక్కింది. దరఖాస్తు సమయంలో అదే మండలానికి చెందిన రమేష్ రెడ్డి, మునికృష్ణా రెడ్డి అనే వ్యక్తుల వద్ద తాను కొద్ది మొత్తం అప్పు తీసుకున్నానని, అయితే లక్కీ డిప్‌లో షాపు వచ్చిన తర్వాత వీరిద్దరూ తనను బెదిరిస్తున్నారంటూ బాధిత మహిళ సోమవారం రాత్రి చిత్తూరు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీసుకున్న డబ్బును తిరిగి ఇచ్చేస్తానని చెబుతున్న తమకు డబ్బు వద్దని దుకాణమే కావాలని బెదిరిస్తున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని మహిళ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



బెండపల్లి చెరువులో మట్టి రవాణా చేస్తున్న వాహనాలు

శాంతిపురం: చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లో సాగుతున్న ఈ వ్యవహారంపై ప్రభుత్వ అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం అవుతున్నారు. అబకలదొడ్డి పంచాయతీలోని కోతిగుట్లపల్లి సమీపంలోని బెండపల్లి చెరువు నుంచి సోమవారం దర్జాగా మట్టి తరలించారు. ఏకంగా 3 జేసీబీలు, 25 ట్రాక్టర్లతో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి రియల్ ఎస్టేట్ వెంచర్‌కు మట్టిని తరలించినట్టు స్థానికులు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోనే ఈ వ్యవహారం రోజంతా సాగినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని వారు వాపోయారు. విపక్షాలకు చెందిన, సామాన్య రైతుల జేసీబీలు, ట్రాక్టర్లు చెరువుల్లోకి మట్టి కోసం రాకుండా అధికారులను ప్రయోగిస్తున్న తెలుగు తమ్ముళ్లు మాత్రం తమ వాహనాలతో రవాణా చేస్తున్నారు. రైతుల పొలాలు, ఇతర అవసరాల కోసం రవాణాదారులు చెప్పిన ధర చెల్లిస్తేనే మట్టిని పొందే అవకాశం కలుగుతోంది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి పచ్చ చొక్కాల పెత్తనాన్ని, అక్రమ రవాణాను అరికట్టాల్సి ఉంది.

క్లుప్తంగా

రోడ్ల మరమ్మతులు చేయించండి
–జెడ్పీ చైర్మన్‌కు వినతి


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులకు సమస్యలు తెలుపుతున్న ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్: రోడ్లు మరమ్మతు చేయించాలని జిల్లాలోని పలు మండలాల ప్రజలు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు నివేదించారు. సోమవారం ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. జీడీ నెల్లూరు, వెదురుకుప్పం, పలమనేరు, గంగవరం, గుడుపల్లె, శాంతిపురం, గుడిపాల వాసులు తమ ప్రాంతాల్లో పలుచోట్ల రోడ్డు మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే వేసవిలో నీటిఎద్దడి సమస్య లేకుండా చూడాలన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

మా ఇళ్లను కూల్చనీయం


సమావేశమైన గ్రామస్తులు

రామకుప్పం(శాంతిపురం): జాతీయ రహదారి విస్తరణ కోసం తమ ఇళ్లను కూల్చనిచ్చేది లేదని రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి వాసులు తీర్మానించారు. సోమవారం రాత్రి గ్రామంలోని రామాలయంలో స్థానికులు సమావేశమై తమ సమస్యపై చర్చించారు. నాలుగు లేన్ల రహదారి పనుల కోసం తమ పంచాయతీలోని చెల్దిగానిపల్లి, బూరుగు మాకులపల్లి గ్రామాల పరిధిలో మొత్తం 110 ఇళ్లు కూల్చాలని చెప్పారు. అందులో 70కి పైగా భవనాలు పూర్తిగా కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా ఇంత కాలం కలిసి ఉన్న గ్రామస్తులు చెట్టుకొకరు, పుట్టకొకరు అవుతామని వాపోయారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవటానికి అందరూ సమైక్యంగా ఉంటూ తమ ఇళ్లను కూల్చకుండా చూడాలని నిర్ణయించారు. ఇళ్ల జోలికి రాకుండా రోడ్డు విస్తరణ కోసం గ్రామానికి సమీపంలో బైపాస్ రోడ్డును నిర్మిస్తే తమ భూములు ఇచ్చి సహకరిస్తామని స్పష్టం చేశారు.

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన బస్సు


చెరువులోకి దూసుకెళ్లిన మినీ బస్సు

గంగవరం: ఐచర్ బస్సు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన గంగవరం మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని నాలుగు రోడ్లు వద్ద ఉన్న గార్మెంట్స్ ఫ్యాక్టరీకి కొంతమంది మహిళలు సోమల మండలం పెద్దఉప్పరపల్లి నుంచి ఐచర్ మినీ బస్సులో బయలుదేరారు. ఉదయం అధికంగా మంచు కురుస్తున్న క్రమంలో హైవేలో వెళుతున్న వాహనం అదుపుతప్పి కల్లుపల్లి గ్రామానికి సమీపంలోని చెరువులోకి దూసుకెళ్లి, చెట్లు అడ్డు రావడంతో ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

మా సమస్యలు పరిష్కరించండి సారూ!

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- వివిధ సమస్యలపై 253 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : తమ సమస్యల పరిష్కారం కోసం విన్నపాలు ఇస్తూనే ఉన్నాం.. అయితే పరిష్కారానికి నోచుకోవడం లేదు.. తమ వినతులు విని, సమస్యలు పరిష్కరించండి సారూ.. అని ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు అధిక సంఖ్యలో వినతులను అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 253 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ప్రజలు అందజేసే వినతులకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి సారూ!

ఇళ్ల స్థలాలు ఇప్పించి ఆదుకోండి సారూ అని వెదురుకుప్పం మండలం పల్లాలు గ్రామ పంచాయతీ వైఎస్సార్‌కాలనీ వాసులు కోరారు. తమ గ్రామానికి సమీపంలో ఎడమర గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. తమ గ్రామంలో సొంతిళ్లు లేని చాలా కుటుంబాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రమణప్ప, వెంకటయ్య, సోము, తదితరులు పాల్గొన్నారు.



నోటీసుల జారీ దారుణం



50 ఏళ్ల కిందట పట్టాల పొంది, చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటున్న తమకు నగరపాలక అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణమని చిత్తూరు పాత బస్టాండ్ షాపుల యజమానుల అసోసియేషన్ నాయకులు వాపోయారు. వారు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు జాఫర్ అలీ, కార్యదర్శి దయాలన్ మాట్లాడుతూ చిత్తూరు పాత బస్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని 1996లో మొత్తం 54 మంది రూ.8 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి పట్టాలు పొందామన్నారు. పాతబస్టాండ్‌లో 10 అడుగులకు 20 అడుగుల కొలతలలో దుకాణాలను ఏర్పాటు చేసుకుని, వ్యాపారాలు చేసుకుంటున్నామన్నారు. తమ స్థలాల్లో మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామంటూ హఠాత్తుగా నగరపాలక అధికారులు తమ దుకాణాలను ఖాళీ చేయించడం అన్యాయమన్నారు. అకస్మాత్తుగా నోటీసులు జారీచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

గ్రామకంఠం భూమిని ఆక్రమించారు

తమ గ్రామంలో గ్రామకంఠం భూమిని ఆక్రమించుకున్నారని చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లె, ఎగువమాసాపల్లె వాసులు వాపోయారు. యాదవ కులస్తులు గ్రామకంఠం భూమిని ఆక్రమించి దిబ్బలు, సెప్టిక్ ట్యాంకులు, గోకులం షెడ్లు నిర్మించుకున్నారన్నారు. ఇది వరకే ఈ సమస్యను మండల అధికారులకు విన్నవించుకున్నామన్నారు. అయితే న్యాయం జరగలేదని వాపోయారు. పరిశీలించి న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు వెంకటప్ప, సునిల్, అరుణ్ తదితరులు కోరారు.



అగ్రకులస్తులు దౌర్జన్యం చేస్తున్నారు

అగ్రకులస్తులు దౌర్జన్యం చేసి, భూమి లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని బంగారుపాళెం మండలం గౌరీశంకరనారాయణపురం ఎస్టీ కాలనీకి చెందిన రామచంద్ర, మునస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 87/42 లో 79 సెంట్లు భూమికి ప్రభుత్వం పట్టాదారు పుస్తకం ఇచ్చిందన్నారు. ఆ భూమి సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ఇటీవల తమ గ్రామానికి చెందిన అగ్రకులస్తులు వచ్చి దౌర్జన్యంతో తమ భూమిలోని పంటను నాశనం చేశారన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



జీడీ నెల్లూరులో దొంగల హల్‌చల్
గ్రామస్తుల తిరుగుబాటుతో పరార్

గంగాధర నెల్లూరు: మండలంలోని మోతరంగనపల్లెలో అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు మండలం మోతరంగనపల్లిలో ఆదివారం రాత్రి బీఎస్ఎఫ్ అధికారి గోపిరెడ్డి ఇంట్లో దొంగలు పడ్డారు. గోపిరెడ్డి నివాసంలో తల్లి సావిత్రమ్మ ఒక్కటే ఉండగా అర్ధరాత్రి దొంగలు రావడంతో ఆమె గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు వెంటనే వచ్చారు. గ్రామస్తుల తిరుగుబాటుతో దొంగలు అక్కడ నుంచి వారు వెంట తెచ్చుకున్న కారును గ్రామస్తుల మీదకు వచ్చేలాగా భయభ్రాంతులకు గురి చేస్తూ అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసంతి అర్ధరాత్రి ఒక గంట సమయంలో క్షణాలలో ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. ఎలాంటి నగదు చోరీకి కాలేదని గ్రామస్తుల తిరుగుబాటుతో దొంగలు పరారీ అయ్యారని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పలు కేడర్ల పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 6 కార్యకర్తల పోస్టులు, మినీ కార్యకర్తలు 2, అంగన్‌వాడీ హెల్పర్లు 20 మొత్తం 28 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఖాళీల వివరాలు సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సంబంధిత అంగన్‌వాడీ, గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన వివాహితులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సంబంధిత గడువు తేదీ లోపు సీడీపీఓ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

తొండ తెచ్చిన తంటా

- సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం
- ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కిన తొండ
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రభుత్వ కార్యాలయాల్లో కాలిపోయిన సామగ్రి
- అధికారులు, రికార్డులకు తప్పిన ప్రమాదం


కాలిపోయిన విద్యుత్ మీటర్


విద్యుత్ షాక్‌తో చనిపోయిన తొండ

ఐరాల: ఓ తొండ రూ.15 లక్షల మేరకు ఆస్తి నష్టానికి కారణమైంది. ట్రాన్స్‌ఫార్మర్‌పైకి వెళ్లడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఏపీఓ కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫ్యాన్లు కాలిపోయాయి. ఈ సంఘటన స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యుత్‌శాఖ అధికారులు కథనం మేరకు.. ఐరాల రెవెన్యూ కార్యాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఓ తొండ ఎక్కింది. అది విద్యుత్ తీగలను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. రెవెన్యూ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుండగా ఒక్కసారిగా వైర్లు నుంచి మంటలు రావడంతో తహసీల్దార్ మహేష్‌కుమార్, సిబ్బంది, ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అప్పటికే కార్యాలయంలోని 5 కంప్యూటర్లు, 3 ప్రింటర్లు, వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో టీవీ, 6 ఫ్యాన్లు కాలిపోయాయి. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ధనలక్ష్మి సిబ్బందితో మాట్లాడుతుండగా ఆమెపై నిప్పురవ్వలు పడడంతో భయంతో పరుగులు తీశారు. కార్యాలయంలో 9 కంప్యూటర్లు, 3 ప్రింటర్లు, 6 ఫ్యాన్లు కాలిపోయాయి. ఏపీఓ కార్యాలయంలో కంప్యూటర్, 3 ఫ్యాన్లు కాలిపోయాయి. బోరు మోటారు, సీసీ కెమెరాలు కూడా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. సిబ్బంది వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. పెను ప్రమాదం తప్పడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కార్యాలయాల్లో రికార్డులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుని జేసీబీ సీజ్


మాట్లాడుతున్న బాలాజీనాయుడు

పలమనేరు: రైతు పొలానికి ఎరువు తోలుకొనేందుకు వాడుతున్న మండలంలోని అయ్యంరెడ్డిపల్లి ధనుంజయ అనే వ్యక్తికి చెందిన జేసీబీని పోలీసులు సీజ్ చేయడం ఎంతవరకు సబబని వైఎస్సార్ సీపీ పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కొలమాసనపల్లి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి సోమవారం ఆయన స్థానిక డీఎస్పీని కలిసి జరిగిన విషయాలను వివరించామన్నారు. దీనిపై ఆయన తహసీల్దార్‌ను కలవాలని సూచించడంతో ఆతన్ని కలిసి ఇది కావాలనే చేశారని వివరించామన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అదే కొలమాసనపల్లి పంచాయతీలో కూటమి నేతలు జేసీబీలతో ఉపాధి పనులు చేసి కూలీలు చేసినట్టుగా ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. మండలంలోని కొండిన్యతోపాటు చెరువులో ఇసుక, మట్టి తవ్వకాలు నిత్యం సాగుతూనే ఉన్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు.

కానీ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడైన ధనుంజయ జేసీబీని కావాలనే సీజ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ విచారించి తమది న్యాయమైతేనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ నాయకులు వీరభద్ర, అమరనాథ రెడ్డి, సాకేపూరు సీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు

- భూ ఆక్రమణపై స్పందించిన అధికారులు
- పనులు ఆపేయాలని హెచ్చరికలు


ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్ఐ భారతి

చౌడేపల్లె: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హనుమంతు నాయక్ హెచ్చరించారు. సోమవారం సాక్షి దినపత్రికలో మంచినీళ్లపల్లెలో భూ ఆక్రమణపై 'ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భారతి, వీఆర్వో సుప్రియ, విలేజ్ సర్వేయర్ మోహన్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రికార్డుల ఆధారంగా పరిశీలించి సర్వే చేస్తామన్నారు. అప్పటి వరకు ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం 58/11 సర్వే నంబర్‌లో 0.83 సెంట్లు గుట్ట పొరంబోకు స్థలం ఉందని, ఈ స్థలాన్ని అధికారులు సర్వే చేసి, సరిహద్దులు గుర్తించి గ్రామాభివృద్ధికి ఆ స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

భూ ఆక్రమణల అనకొండ

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా!
- వత్తాసు పలుకుతున్న అధికారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- రెచ్చిపోతున్న కూటమి నాయకులు


జేసీబీతో చెట్లను తొలగిస్తున్న కూటమి నాయకులు

గంగాధరనెల్లూరు : కుంటలు, చెరువులు, పొరంబోకు భూములు కనిపిస్తే చాలు కూటమి నాయకులు యథేచ్ఛగా యంత్రాలతో చదును చేసి ఆక్రమించేస్తున్నారు. మండల పరిధిలోని బాలగంగనపల్లి పంచాయతీ నాగూరుపల్లి గ్రామం సర్వే నంబర్ 893/2లో 7 ఎకరాలా 37 సెంట్లు గుట్ట (గయ్యాళి పరంబోకు) డీకేటీ భూమిపై కన్నేసిన ఓ కూటమి నాయకుడు ఆక్రమించుకుని రాత్రి, పగలు జేసీబీ యంత్రాలతో దర్జాగా చదును చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. దీనిపై స్థానికులు అనేకసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, కనీసం తాత్కాలికంగా కూడా నిలుపుదల చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2023లో గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆ సర్వే నంబర్‌కు ఎలాంటి పట్టా ఇవ్వలేదని అంటున్నా ప్రస్తుత తహసీల్దార్ ఈ సర్వే నంబర్‌పై 1997లో వారికి డీకేటీ పట్టా ఉందని భూ బకాసురులను వెనుకేసుకు రావడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ సమస్య కోర్టులో ఉందని తహసీల్దార్ గ్రామస్తులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పరంబోకు భూమి కూటమి నాయకుల చేతిలోకి వెళ్లడంతో పట్టా భూములకు దారి సౌకర్యం లేకుండా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భూ ఆక్రమణను నిలుపుదల చేయాలని కోరారు. ఈ విషయమై సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సదస్సు వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొన్నారు.

ఆటోలో యువకుని మృతదేహం



ఆటోలో జ్యోతినాథ్ మృతదేహం, జ్యోతినాథ్(ఫైల్)

పలమనేరు: మండల కేంద్రమైన గంగవరం సమీపంలోని సాయినగర్ వద్ద ఓ యువకుని మృతదేహం ఆటోలో పడి ఉండడాన్ని అక్కడి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలంలోని సాయినగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ జ్యోతినాథ్(32) తన ఆటోలో పడిఉండగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతోవారు అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా మృతదేహం ఉన్న ప్రాంతం సాయినగర్ సమీపంలోని ఎర్రమనగుంట క్రికెట్ ఆడే ప్రాంతంగా తెలిసింది. ఇతను సొంత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేశారా? తెలియడం లేదు. ఎందుకంటే మృతుని పెదవులు బాగా ఉబ్బిఉన్నాయి. ఆటోలో వెనుక వైపు ఎస్‌వీఆర్ జ్యులరీస్ అనే బ్యాగు ఉంది. పోస్ట్‌మార్టమ్ నివేదిక వస్తేగాని దీనిపై క్లారిటీ రాదని పోలీసులు చెబుతున్నారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కాదు.. కాలక్షేప వేదిక



సమావేశంలో రీల్స్ చూస్తూ కాలక్షేపం చేస్తున్న అధికారులు

కుప్పం: ప్రతి సోమవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక అధికారులకు కాలక్షేపానికి వేదికగా మారింది. సోమవారం కడా పీడీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ అనంతరం నియోజకవర్గ స్థాయి అధికారులతో కడా పీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అధికారులకు కాలక్షేపానికి వేదికగా మారింది. వేదిక పైనా కడా పీడీ అర్జీలు స్వీకరిస్తుంటే..మరో వైపే అధికారులు టైమ్ పాస్ కోసం సెల్‌ఫోన్లలో రీల్స్ చూస్తు టైమ్ పాస్ చేస్తున్నారు. ప్రతి వారం అన్ని శాఖ అధికారుల సమావేశాని రావాలని కడా అధికారుల ఆంక్షలు విధించారు. కానీ నియోజకవర్గ స్థాయి అధికారుల సగం శాఖలపైగా సమావేశానికి హాజరు కావడం లేదు. వచ్చినా వారు ప్రజా సమస్యలు పక్కన పెట్టి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఓ వైపు కడా పీడీ అర్జీలు స్వీకరిస్తుండగా మరో వైపు అధికారుల వారి వారి వ్యాపకాల్లో నిమగ్నమయ్యారు.

45 అర్జీలు స్వీకరణ

ప్రజాసమస్య పరిష్కార వేదికలో సోమవారం 45 అర్జీలకు కడా పీడీ వికాస్ మర్మత్ స్వీకరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో అర్జీలదారుల తమ సమస్య పరిష్కారం కోరుతూ కడా పీడీ వినతులు అందజేశారు.

స్నోయగం

మంచుదుప్పటి కప్పేసింది. దారి కూడా కనిపించనంత దట్టంగా వ్యాపించింది. ఉదయం 8 గంటల తరువాత కూడా లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పొగమంచులో సూర్యోదయం ప్రకృతి కాన్వాస్‌పై సరికొత్త అందాన్ని ఆవిష్కరించింది. లేలేత కిరణాల వెలుగు ఫ్లైఓవర్‌కు మరింత వన్నె తెచ్చాయి. ఈ దృశ్యాలు సోమవారం ఉదయం పుత్తూరులో కనువిందు చేశాయి. - పుత్తూరు


పుత్తూరులో ఉదయం 8 గంటలకు వీడని పొగమంచు


ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మంచు


పొగమంచులో వాకింగ్ చేస్తున్న జనం


పొగమంచుకు కనిపించని రైల్వేస్టేషన్